
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

ఆదివారం । 29 । డిసెంబర్ । 2024



సోమశిలలో 71.791 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో శనివారానికి 71.791 టీఎంసీలు ఉన్నాయి. ఎగువ నుంచి 3,300 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుంది. డెల్టాకు 1550, ఉత్తరకాలువకు 600, కండలేరుకు 800, దక్షిణకాలువకు 350 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.78,730
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.7,135
3 శాతం జీఎస్టీతో	రూ.7,349
నవర (8 గ్రా)	రూ.58,792

గరిష్ఠం/కనిష్ఠం
31.1 /24.4

వాతావరణం

జిల్లాలో ఆదివారం వాతావరణం పొడిగా ఉంటుంది. పగటి, రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణగా ఉంటాయి. శనివారం గాలిలో తేమ 82 శాతం ఉంది.

న్యూస్‌రీల్

నేరాల కట్టడిలో అప్రమత్తంగా ఉండాలి

- ఎస్పీ కృష్ణకాంత్
- చేజర్ల పోలీస్‌స్టేషన్లో తనిఖీ



పోలీస్ అధికారులు, సిబ్బంది గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎస్పీ కృష్ణకాంత్

చేజర్ల: నేరాలపై పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ జి.కృష్ణకాంత్ సూచించారు. శనివారం చేజర్ల పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ తనిఖీ చేశారు. మ్యాప్, క్రైమ్ చార్ట్, రికార్డులను పరిశీలించారు. స్టేషన్ పరిధిలో శాంతిభద్రతల పరిస్థితిపై చర్చించారు. ఆయన మాట్లాడుతూ అనుమానాస్పద మరణాలు, కుటుంబ తగాదాల వివరాలు, మిస్సింగ్ కేసులను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. దొంగతనం కేసుల్లో కోల్పోయిన ప్రాపర్టీ రికవరీపై దృష్టి సారించాలన్నారు. నమోదైన కేసుల్లో దర్యాప్తు వేగవంతం చేయాలని సూచనలు చేశారు. ద్విచక్ర వాహనాల్లో వెళ్లేటప్పుడు పోలీస్ సిబ్బంది తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. స్కూల్స్, కళాశాలల్లో, ప్రజలకు సైబర్ నేరాలపై విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. పోలీసు అధికారులు, సిబ్బంది సంక్షేమం, సమస్యలపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో ఎస్సై జే తిరుమలరావు, ఏఎస్సై నాగరాజు సిబ్బంది పాల్గొన్నారు.

వీఆర్‌కు వేదాయపాళెం సీఐ కిశోర్‌కుమార్

- కొత్త సీఐగా శ్రీనివాసులురెడ్డి బాధ్యతల స్వీకరణ



నెల్లూరు (క్రైమ్): నెల్లూరు వేదాయపాళెం పోలీసుస్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న ఆర్‌ఎస్ కిశోర్‌కుమార్ రేంజ్ వీఆర్‌కు బదిలీ కాగా ఆయన స్థానంలో రేంజ్ వీఆర్‌లో ఉన్న వి. శ్రీనివాసులురెడ్డిని నియమిస్తూ గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ట త్రిపాఠి ఉత్తర్వులు జారీ చేశారు. వి.శ్రీనివాసులరెడ్డి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు సిబ్బంది పుష్పగుచ్ఛాలిచ్చి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన ఎస్పీ జి. కృష్ణకాంత్, ఏఎస్పీ సీహెచ్ సౌజన్య, నగర డీఎస్పీ డి. శ్రీనివాసరెడ్డిలను మర్యాద పూర్వకంగా కలిశారు. శ్రీనివాసులురెడ్డి 2004 బ్యాచ్ ఎస్ఐ. జిల్లాలోని కావలి, మనుబోలు, తడ పోలీసుస్టేషన్లలో ఎస్ఐగా పనిచేశారు. 2012లో సీఐగా ఉద్యోగోన్నతి పొంది నెల్లూరు రూరల్ సర్కిల్, నాయుడుపేట, ఒంగోలు తాలూకా, ఒంగోలు రూరల్ సీఐగా పనిచేశారు.

పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలి



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ

నెల్లూరు (పొగతోట) : స్వయం సహాయక గ్రూపు మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేలా ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి అన్నారు. డీఆర్‌డీఏ కార్యాలయంలో శనివారం అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రతి మండలం నుంచి ఐదుగురు వీఓఏలను ఎంపిక చేయాలన్నారు. నియోజకవర్గాల్లో ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అందులో పొదుపు మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు అవసరమైన శిక్షణా కార్యక్రమాలు, దరఖాస్తులు, బ్యాంకు రుణాలు తదితర అంశాలపై అవగాహన కల్పిస్తారన్నారు. జిల్లా వ్యాప్తంగా నిరుద్యోగులను గుర్తించాలని, వారికి ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు ఇచ్చేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. సమావేశంలో జేడీఎం హైమావతి, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి అబ్దుల్ ఖయ్యుం తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ కులగణనపై సోషల్ ఆడిట్

నెల్లూరురూరల్: ఎస్సీ కులగణనకు సంబంధించి సోషల్ ఆడిట్ చేస్తామని ఎస్సీ సంక్షేమ సాధికారత అధికారి శోభారాణి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అందులో భాగంగా ఈ నెల 31వ తేదీ వరకు అన్ని గ్రామ, వార్డు సచివాలయాల్లో జాబితాలను ఉంచుతామని, ఈ లోపు ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే వెంటనే గ్రామ వార్డు సచివాలయాల్లో వీఆర్‌ఓలకు సమర్పించాలని తెలిపారు. అభ్యంతరాలపై జనవరి 6వ తేదీ వరకు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తామని తెలిపారు. మూడు దశల్లో కలెక్టర్, ఆర్డీఓ, సంక్షేమశాఖ అధికారులు తనిఖీ చేస్తారని తెలిపారు.

మినుముకు ముసురు దెబ్బ

రబీలో కోతకు వచ్చిన పంట

- ఎడతెరిపి లేని వర్షాలకు కాయల్లో మొలకలు
- జిల్లాలో 500 హెక్టార్లలో కోసిన పంటకు నష్టం
- అధిక తేమతో పూత, కాయ కాయని పరిస్థితి



బంగాళాఖాతంలో వరుసగా ఏర్పడిన అల్పపీడనాల ప్రభావంతో గత కొద్ది రోజులుగా ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షం మినుము రైతులకు నష్టాలు మిగిల్చింది. రబీ సీజన్ సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో సాగు చేసిన మినుము, పెసర, బొబ్బర, అలసంద తదితర పప్పు ధాన్యాల పైర్లు డిసెంబర్ చివరి వారంలో కోతకు వస్తాయి. ఈ సమయంలో తరచూ వర్షాలు కురుస్తుండడంతో ప్రస్తుతం కొన్ని ప్రాంతాల్లో కోత కోసిన, కోతకు వచ్చిన మినుము దెబ్బతింది. తేమ శాతం అధికంగా ఉండడంతో పైరు దెబ్బతింది. పూత దశలో ఉన్న కంది కూడా పూత రాలి దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపనుంది.



దెబ్బతిన్న మినుమును చూపుతున్న రైతు మాధవరెడ్డి

➡ ఈ చిత్రంలో కనిపిస్తున్న రైతు పేరు మాధవరెడ్డి. వరికుంటపాడు మండలం గణేశ్వరపురం. ఇతను 5 ఎకరాల్లో మినుము సాగు చేశాడు. డిసెంబర్‌లో వర్షాలు ఎక్కువగా పడడంతో తెగుళ్లు, చీడపీడలు ఆశించి దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపాయి. కోతకు వచ్చి కోసే దశలో ఉన్న పంట వానకు నాని కాయలు ఉబ్బిపోయాయి. ఇప్పటికే వర్షానికి నానిన పంట మీదనే కాయలు మొలకెత్తాయి. కనీసం పెట్టిన పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదని రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.



వరికుంటపాడు మండలంలో వర్షానికి దెబ్బతిన్న మినుము పంట

ఉదయగిరి/పొదలకూరు: జిల్లాలో రబీ సీజన్‌లో సాధారణంగా మినుము పంట 41,737 ఎకరాల్లో సాగవుతోంది. అయితే మారుతున్న వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో పంట గిట్టుబాటు ధరలు లేక చాలా వరకు సాగు విస్తీర్ణం తగ్గింది. ప్రస్తుతం రబీలో 8,667 ఎకరాల్లోనే సాగు చేశారు. అది కూడా ఎక్కువగా ఉదయగిరి, వింజమూరు, పొదలకూరు, ఆత్మకూరు, కందుకూరు వ్యవసాయ సబ్ డివిజన్లల్లో వర్షాధార మెట్ట పైరుగా సాగు చేశారు. ఈ ఏడాది మెట్ట ప్రాంతాల్లో అక్టోబర్‌లో ముందుగా వానలు పడడంతో విత్తనం వేశారు. దీంతో ప్రస్తుతం పంట కోత దశలో ఉంది. డిసెంబరు నెలంతా చిరు జల్లుల నుంచి మోస్తరు వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. దీంతో పైరుకు ఎక్కువగా చీడ పీడలు ఆశించాయి. వీటి నివారణకు రైతులు భారీగా ఖర్చు పెట్టాల్సి రావడంతో పెట్టుబడి వ్యయం పెరిగింది. లాభాల సంగతి అటుంచి పెట్టిన పెట్టుబడులైనా వస్తాయనుకుంటే ప్రస్తుతం కురిసిన వర్షాలు ఆ ఆశలు కూడా లేకుండా చేసింది.



పొదలకూరులో సాగులో ఉన్న మినుము పంట

500 హెక్టార్లలో పంట నష్టం

గత నెల రోజులుగా ఫెంగల్ తుఫాన్, తీవ్ర అల్పపీడనాల ప్రభావంతో కురిసిన వర్షాలకు జిల్లాలో మెట్ట ప్రాంత రైతులు తీవ్రంగా నష్టపోయారు. కోతకు వచ్చిన వరి, మినుము కొంత మేర దెబ్బతిన్నాయి. సాగులో ఉన్న 79 ఎకరాల మినుము పంటకు నష్ట పరిహారం కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు మరో 500 హెక్టార్ల వరకు పంట నష్టం వాటిల్లే అవకాశం ఉందని వ్యవసాయ అధికారులు ప్రాథమిక అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా వరికుంటపాడు మండలంలో కోత దశలో ఉన్న 150 హెక్టార్లలో పైరుకు నష్టం వాటిల్లింది.

తేమ శాతం పెరిగి పంట నష్టం

పొదలకూరు వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలో మినుము, పెసర పంటలు దెబ్బతిన్నాయి. పొలాల్లో పంటలు ఏపుగా వచ్చినా కాయలు ఏర్పడలేదని రైతులు వాపోతున్నారు. అతివృష్టి, అనావృష్టి కారణంగా ఈ ప్రాంతంలో అపరాల సాగు బాగా తగ్గించారు. అయితే ప్రతి ఏడాది ఖరీఫ్ తర్వాత రబీలో కొందరు రైతులు మినుము, పెసర పంటల సాగు చేస్తున్నారు. పొదలకూరు వ్యవసాయ సబ్‌డివిజన్ పరిధిలో పొదలకూరు, రాపూరు, కలువాయి, చేజర్ల, మనుబోలు మండలాల్లో మనుబోలు మినహా మిగిలిన మండలాల్లో సుమారు 2 వేల ఎకరాలు పైబడి మినుము, పెసర పంటలను సాగు చేస్తున్నారు. మినుము, పెసరలో నవంబర్, డిసెంబర్ నెలల్లో అల్పపీడనాల ప్రభావంతో జడివానలు, ముసురు పట్టి తేమ శాతం పెరిగింది. పొలాల్లో నీరు బయటకు కాలువల ద్వారా పంపినా ఫలితం లేకుండాపోయింది. పైరు పెరిగినా కాయలు పూత, కాయలు రాలేదని అంకుపల్లి, చెన్నారెడ్డిపల్లి, మొగళ్లూరు తదితర గ్రామాల రైతులు వెల్లడిస్తున్నారు.



పంట నష్టంపై ప్రభుత్వానికి ప్రతిపాదనలు

ఫెంగల్ తుఫాన్, ఆ తర్వాత అల్పపీడనాల ప్రభావంతో కురిసిన వర్షాలకు 29.46 హెక్టార్లలో మినుముకు నష్టం జరిగినట్లు గుర్తించి పరిహారం కోసం ప్రతిపాదనలు పంపాం. తాజాగా మరో 150 హెక్టార్లలో మినుమ దెబ్బతిన్నట్లు ప్రాథమికంగా నివేదికలు వచ్చాయి. ప్రభుత్వ ఆదేశాలు ప్రకారం పంట దెబ్బతిన్న రైతులకు పరిహారం అందజేస్తాం. అపరాలు, వరికి సంబంధించి పంటల బీమా పథకం కోసం ఈనెల 31 వరకు ప్రీమియం చెల్లించే అవకాశం ఉంది. రైతులు సమీప రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలి. పంటలు నష్టపోయిన రైతులకు బీమా వచ్చే అవకాశం ఉంది.

– సత్యవాణి, జిల్లా వ్యవసాయశాఖ అధికారిణి

సోమిరెడ్డి తప్పుడు మనిషి

- తప్పుడు కేసులు పెట్టించే సంస్కృతి ఆయనదే
- కాణిపాకంలో ప్రమాణం చేసే ధైర్యం ఉందా?
- సోమిరెడ్డికి సవాల్ విసిరిన కాకాణి
- వాట్సాప్ డేటా, కాల్ లిస్ట్ బయటకు తీస్తే ఆయన బాగోతాలు బయటకొస్తాయి
- కరెంట్ చార్జీల పెంపుపై పోరుబాట విజయవంతం
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి

నెల్లూరు (బారకాసు): సోమిరెడ్డి రాజకీయ జీవితమంతా తప్పుడు పనులతోనే కొనసాగింది. ఆయన చేస్తున్న అవినీతి, అక్రమాలపై ఎవరైనా మాట్లాడితే వారిని నేరుగా ఎదుర్కొనే దమ్ము, ధైర్యం లేక తప్పుడు కేసులు పెట్టించి వేధించే సంస్కృతి ఆయనకు చేతనైనంత ఎవరికి చేతకాదని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీమంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. నెల్లూరు నగరంలోని పొదలకూరురోడ్డు సాయిరాంనగర్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కాకాణి మాట్లాడారు. విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ తమ పార్టీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం ఉమ్మడి నెల్లూరు జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో నిర్వహించిన పోరుబాట ప్రభుత్వంపై వ్యతిరేకతకు అద్దం పట్టిందన్నారు. తాము ఊహించిన దానికంటే మిన్నగా ప్రజలే స్వచ్ఛందంగా తరలివచ్చి, పలుచోట్ల పోలీసులు నిర్బంధాలు, అధికారులు అత్యుత్సాహాలను ఎదుర్కొని పోరుబాటను విజయవంతం చేశారన్నారు.

కాణిపాకంలో ప్రమాణం చేస్తావా?

తాను అవినీతి, అక్రమాలకు పాల్పడ లేదని కాణిపాకంలో ప్రమాణం చేసే దమ్ము సోమిరెడ్డికి ఉందా? అని కాకాణి ప్రశ్నించారు. ఈ నెల 11వ తేదీన తాను మీడియా సమావేశంలో వెల్లడించిన మూడు అంశాలకు సంబంధించి కాణిపాకం వినాయక స్వామి ఎదుట వచ్చి తాను ఏ తప్పు చేయలేదని, ఎలాంటి అక్రమాలకు, అవినీతికి పాల్పడ లేదని ప్రమాణం చేయాలని సవాల్ విసిరానని కాకాణి గుర్తు చేశారు. అయితే ఇప్పటి వరకు సోమిరెడ్డి నుంచి ఎలాంటి స్పందన లేదన్నారు. ఇప్పటికైనా సోమిరెడ్డి కాణిపాకానికి వచ్చి తాను అడిగిన వాటికి సంబంధించి ప్రమాణం చేయాలని డిమాండ్ చేశారు. అరబిందో సంస్థకు ఫోన్ చేసి రూ.5 కోట్లు అడగడం, పొదలకూరులో లేఅవుట్లు వేసిన వారినుచి డబ్బులు డిమాండ్ చేయడం, విజిలెన్స్ పేరుతో ఇరిగేషన్ అధికారులు నుంచి నగదు వసూలు చేయలేదని, ఎలాంటి అవినీతి, అక్రమాలకు పాల్పడలేదని, ఎవరిని బ్లాక్ మెయిల్ చేయలేదని ప్రమాణం చేసి తన నిజాయితీని నిరూపించుకోవాలని కాకాణి డిమాండ్ చేశారు. లేని పక్షంలో సోమిరెడ్డి అవినీతి, అక్రమాలకు పాల్పడినట్లు ఒప్పుకున్నట్లుగా భావించాల్సి వస్తుందన్నారు. సోమిరెడ్డి ఫోన్‌లోని వాట్సాప్ డేటా, కాల్ లిస్ట్ బయటకు తీస్తే నిజానిజాలు వెలుగులోకి వస్తాయన్నారు. సీఎం అపాయింట్‌మెంట్ ఇప్పించాలని ఓ ప్రముఖ వ్యక్తి సోమిరెడ్డిని అడిగితే అందుకు తనకు గోల్డ్ (బంగారం) ఇవ్వాలని అడగడం ఇంతకన్నా సిగ్గు చేటు మరొకటి లేదన్నారు. ఇప్పటికే ఉద్యోగుల బదిలీలు, పదోన్నతులు, మట్టి, ఇసుక, బూడిద, లే అవుట్లు, ఇరిగేషన్ పనులు వంటి వాటిల్లో సోమిరెడ్డి అనేక అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు.

సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం సాగిస్తాం



స్వతంత్ర పార్క్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న గురుకుల పాఠశాలల ఉపాధ్యాయులు

నెల్లూరు (వీఆర్సీసెంటర్): గిరిజన గురుకుల పాఠశాలల్లో పనిచేస్తున్న టీచర్ల సమస్యలు పరిష్కారమయ్యే వరకు పోరాటం సాగిస్తూనే ఉంటామని గిరిజన గురుకుల అవుట్‌సోర్సింగ్ యూనియన్ నాయకులు భరత్, స్వాతి హెచ్చరించారు. నగరంలోని గాంధీబొమ్మ సెంటర్ సమీపంలో ఉన్న స్వతంత్ర పార్క్‌లో శనివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. వీరు మాట్లాడుతూ తమ సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష ధోరణి అవలంభిస్తోందన్నారు. గత 45 రోజులుగా విధులు బహిష్కరించి తమ న్యాయమైన డిమాండ్ల కోసం పోరాటాలు సాగిస్తున్నా అధికారులు, ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. గత 15 సంవత్సరాలుగా పనిచేస్తున్నా, తమకు ఉద్యోగ భద్రత లేదని, చాలీచాలని వేతనాలతో కటుంబ పోషణ కష్టతరంగా మారిందని వాపోయారు. తాము చేస్తున్న పోస్టులను డీఎస్సీలో కలిపి భర్తీ చేస్తామనడం అన్యాయమని, 2022 పీఆర్సీ ప్రకారం వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు రమణ, కళ్యాణి, శ్రీనివాసులు, కృష్ణ, సునీల్, దిల్షాద్, సౌభాగ్య తదితరులు పాల్గొన్నారు.

31లోపు నివేదిక ఇవ్వండి

నెల్లూరు (టౌన్): నగరంలోని కస్తూరిదేవి బాలికోన్నత పాఠశాలలో హెడ్‌మాస్టర్‌గా విధులు నిర్వహించి పదవీ విరమణ చేసిన టి.వనజపై వచ్చిన అభియోగాలను విచారించి ఈ నెల 31వ తేదీలోపు నివేదిక అందజేయాలని డీఈఓ ఆర్.బాలాజీరావు ఆదేశించారు. విచారణాధికారిగా నెల్లూరు ఎంఈఓ తిరుపాల్‌ను నియమించారు. నెల్లూరుకు చెందిన బి.సురేంద్రరెడ్డి విశ్రాంత హెచ్ఎం వనజ హయాంలో అభియోగాలు చేస్తూ దీనిపై విచారణ జరిపించాలని కోరుతూ రాష్ట్ర విద్యాశాఖా మంత్రి లోకేశ్ కు లేఖ పంపించారు. ఈ నేపథ్యంలో డీఈఓ విచారణకు ఆదేశించారు.

ఆ విషాదం.. మానని గాయం

చంద్రబాబు ప్రచార యావకు జరిగిన తొక్కిసలాట ఘటనలో 8 మంది అమాయకులు బలైన విషాదానికి సరిగ్గా రెండేళ్లు అయింది. సంచలనం రేకెత్తించిన పెనువిషాద ఘట్టానికి కందుకూరు పట్టణంలో జరిగిన చంద్రబాబు బహిరంగ సభ వేదికైంది. చంద్రబాబు పబ్లిసిటీ పిచ్చికి తోడు స్థానిక నాయకుల ఆధిపత్య పోరుతోనే ఈ దుర్ఘటన జరిగిందని నాడు విమర్శలు వినిపించాయి. ఆ విషాద ఘటనకు పూర్తిగా టీడీపీదే బాధ్యత అయినప్పటికీ.. ఆ నాటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఉదారంగా ఆయా కుటుంబాలను ఆదుకుని బాసటగా నిలిచింది.

- కందుకూరు దుర్ఘటనకు రెండేళ్లు
- ఇరుకురోడ్ల కూడలిలో చంద్రబాబు బహిరంగ సభ
- తొక్కిసలాటలో ప్రాణాలు కోల్పోయిన 8 మంది అమాయకులు
- బాధిత కుటుంబాలకు రూ.2 లక్షల సాయంతో బాసటగా నిలిచిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం



చంద్రబాబు బహిరంగ సభలో తొక్కిసలాట చోటు చేసుకున్న ప్రాంతం (ఫైల్)

కందుకూరు: చంద్రబాబు.. నాడు ప్రతిపక్ష నేతగా ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం పేరుతో కందుకూరు పర్యటనకు వచ్చారు. అందులో భాగంగా రోడ్ షోతోపాటు, ఎన్టీఆర్ సర్కిల్‌లో 2022 డిసెంబర్ 28వ తేదీ సాయంత్రం బహిరంగ నిర్వహించేందుకు ప్లాన్ చేశారు. అయితే ఈ కార్యక్రమం నిర్వహణలో పూర్తిగా నిబంధనలు ఉల్లంఘించడంతో తొక్కిసలాట జరిగింది. చంద్రబాబు మధ్యాహ్నం సింగరాయకొండ జాతీయ రహదారి నుంచి ర్యాలీగా వచ్చి సాయంత్రం 4 గంటలకు ఎన్టీఆర్ సర్కిల్ వద్ద బహిరంగ సభ నిర్వహించాల్సి ఉంది. అయితే ఈ కార్యక్రమం బాగా ఆలస్యమై కందుకూరు చేరుకునే సరికి రాత్రి 7.30 గంటలైంది. దీనికి తోడు ఎన్టీఆర్ సర్కిల్ ఇరుకుగా ఉంటుంది. కేవలం 30 అడుగుల విస్తీర్ణం ఉండే రోడ్లకు పక్కనే పెద్ద సైడ్ కాలువలు ఉన్నాయి. ఇటువంటి ఈ ప్రాంతంలో స్థానిక నేతలు ఇంటూరి నాగేశ్వరరావు (ప్రస్తుతం ఎమ్మెల్యే), ఇంటూరి రాజేష్ పోటాపోటీగా రోడ్లకు ఇరువైపులా భారీగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడంతో అసలే ఇరుకైన రోడ్డు మరింత ఇరుగ్గా మారింది. ఇరుకైన రోడ్డులో సభను నిర్వహిస్తే.. జనం బాగా వచ్చినట్లు కనిపిస్తారని, డ్రోన్ వీడియోలకు బాగా వస్తాయని ఉద్దేశంతో ఈ విధంగా వ్యవహరించారు. చంద్రబాబు బహిరంగ ప్రదేశంలో కనీసం జనం నిలబడడానికి కూడా కాస్తంత ఖాళీ దొరకని పరిస్థితిని తీసుకొచ్చారు.

ఒక్కసారిగా తొక్కిసలాట

రాత్రి 7.30 గంటల సమయంలో చంద్రబాబు కాన్వాయ్ రాలీగా వచ్చింది. ఎన్టీఆర్ సర్కిల్‌లో చంద్రబాబు తన ప్రసంగ వాహనాన్ని నిలపాల్సి ఉండగా, కాస్త ముందుకు వచ్చి బాగా ఇరుగ్గా ఉండే ప్రదేశంలో ఆపారు. ఈ పరిణామంతో అప్పటికే కిక్కిరిసి ఉన్న ఈ నాలుగు రోడ్ల కూడలి మరింత ఇరుకుగా మారిపోయింది. చంద్రబాబు మాట్లాడే ముందు కొందరు గుండంకట్ట రోడ్డులో ఉన్న లైవ్ వెహికల్ ఎక్కడంతో లైవ్ రాదు.. మీరంతా దిగాలి అంటూ చంద్రబాబు కేకలు వేశారు. ఏయ్.. తమ్ముళ్లూ అందరూ దిగండి అంటూ పదే పదే అరిచారు. దీంతో ఆ ప్రాంతంలో అలజడి రేగింది. చంద్రబాబు ప్రసంగ వాహనానికి వెనుక వైపు ఉన్న వారంతా ఒక్కసారిగా ముందు వైపు చొచ్చుకురావడంతో మరింత గందరగోళ వాతావరణం నెలకొని తోపులాటకు దారి తీసింది. గుండంకట్ట రోడ్డులో జరిగిన ఈ తోపులాటకు పక్కనే ఉన్న ద్విచక్ర వాహనాలు కింద పడిపోయాయి. ఈ సమయంలో ఆ ప్రాంతంలో ఉన్న జనా లు ఒక్కసారిగా పరుగు తీయడం మొదలు పెట్టారు. ఈ హడావుడిలో కొందరు జనాలు కింద పడిపోయారు. తొక్కిసలాట జరిగి అక్కడికక్కడే 8 మంది ప్రాణాలు కోల్పోయారు. మరో 8 మంది తీవ్రగాయాలతో ఆస్పత్రి పాలయ్యారు.



చంద్రబాబు పబ్లిసిటీ పిచ్చి వల్లే ప్రమాదం

చంద్రబాబు కందుకూరు పర్యటన అప్పటికి వారం రోజుల ముందే ఖారారైంది. దీంతో అప్పటి నుంచి ఇంటూరి నాగేశ్వరరావు, ఇంటూరి రాజేష్ ఇరువురు కందుకూరు వేదికగా బల ప్రదర్శనకు దిగారు. పోటాపోటీగా ఫ్లెక్సీలు కట్టడడం మొదలు పెట్టారు. నిబంధనలు అతిక్రమించి కందుకూరు పట్టణం మొత్తం ఫ్లెక్సీలతో నింపారు. చంద్రబాబు బహిరంగ సభ ప్రదేశమైన ఎన్టీఆర్ సర్కిల్‌లో ఇష్టారీతిన ఫ్లెక్సీలు, భారీ హోర్డింగ్‌లు పెట్టారు. సర్కిల్ నుంచి పామూరు వైపు వెళ్లే రోడ్డు 100 అడుగుల పైనే విస్తీర్ణం ఉంటుంది. ఈ రోడ్డు వైపు నిలబడే చంద్రబాబు ప్రసంగించాలి. ఆయనకు కనిపించే విధంగా రోడ్డుకు ఇరువైపులా రోడ్డు మొత్తం ఆక్రమించి ఇరువైపులా భారీ ఫ్లెక్సీలు కట్టారు. 40 అడుగులకు కుచించుకుపోయింది. కొద్ది మంది జనం వచ్చినా కూడా భారీగా కనిపించాలనే ఆలోచనలతో ఈ పని చేశారు. దీంతో రోడ్డు మొత్తం ఇరుకుగా మారిపోయింది. కిక్కిరిసి ఉన్న జనాన్ని డ్రోన్ షాట్‌లు తీసి సోషల్ మీడియాలో ప్రచారం చేసుకోవాలనే ప్రణాళిక వల్లే ఎనిమిది చనిపోయారని నాడు పెద్ద ఎత్తున విమర్శలు వ్యక్తమయ్యాయి.

మృతుల కుటుంబాలను ఆదుకున్న నాటి జగన్ ప్రభుత్వం

చంద్రబాబు బహిరంగ సభలో జరిగిన తొక్కిసలాటలో మృతి చెందిన కుటుంబాలకు అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తక్షణ సాయం ప్రకటించారు. వాస్తవానికి ఇది పూర్తిగా టీడీపీ నిర్లక్ష్యం వల్లే జరిగినప్పటికీ బాధ్యతగా ప్రభుత్వం నుంచి సాయం అందించి ఆ కుటుంబాలకు బాసటగా నిలిచారు. 8 మంది మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.2 లక్షల చొప్పున ఆర్థిక సాయాన్ని ఆ నాటి వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. గాయపడిన వారికి మెరుగైన చికిత్స అందించేందుకు అప్పటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో అధికారులు చర్యలు తీసుకున్నారు.

క్లుప్తంగా

వేడుకగా ఆరాట్టు ఉత్సవం



నెల్లూరు(బారకాసు): మండల పూజలను పురస్కరించుకొని నగరంలోని అయ్యప్ప స్వామి దేవస్థానంలో ఆరాట్టు ఉత్సవాన్ని వేడుకగా శనివారం నిర్వహించారు. క్షీరాభిషేకాలు, మహాగణపతి హోమం, గో పూజను ఉదయం జరిపారు. పడి కర్పూర పూజ, ధ్వజావరోహణాన్ని నిర్వహించారు. గూడల శేషగిరిరావు, కత్తుల వెంకటరత్నం, కోశాధికారి గడ్డం రత్నయ్య, కత్తి మోహన్‌రావు, శంకరన్, ప్రసాద్, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పేచిరాజ్‌కు నేదురుమల్లి పరామర్శ



జిల్లా జైలు వద్ద రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటాచలం: అక్రమ కేసులు బనాయించడంతో రిమాండ్‌లో ఉన్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వెంకటగిరి పట్టణ యువజన నేత తంగ పేచిరాజ్‌ను పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి శనివారం పరామర్శించారు. మండలంలోని చెముడుగుంట వద్ద గల జిల్లా జైల్లో పేచిరాజ్‌ను ములాఖత్ ద్వారా కలిసి ధైర్యం చెప్పారు.

విద్యార్థులను ఉత్తమంగా తీర్చిదిద్దాలి



మాట్లాడుతున్న బాలాజీరావు

నెల్లూరు (టౌన్): విద్యార్థులను ఉత్తమంగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని డీఈఓ బాలాజీరావు పేర్కొన్నారు. వెంకటాచలం మండలం గొలగమూడిలోని ఐఐటీఎం కళాశాలలో నిర్వహిస్తున్న ఎఫ్ఎల్ఎన్ శిక్షణ కార్యక్రమాన్ని శనివారం పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. విద్యార్థులు తగిన సామర్థ్యాలు సాధించేలా శిక్షణలో పాల్గొన్న ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. సమగ్రశిక్ష ఏఎంఓ సుధీర్‌బాబు, ఎంఈఓ శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరాలపై దాడులు

- రూ.15 వేల నగదు, రెండు బైక్‌ల స్వాధీనం



నిందితుడితో పోలీసులు

అనుమసముద్రంపేట: మండలంలోని గుడిపాడు పంచాయతీ పరిధిలో గల కొత్తపల్లి సమీపంలో పేకాటాడుతున్న వారిపై ఏఎస్‌పేట ఎస్సై సైదులు, సిబ్బందితో కలిసి శనివారం దాడులు చేశారు. వివరాలు.. గ్రామ సమీపంలో పేకాటాడుతున్నారనే సమాచారంతో దాడులు నిర్వహించామని, ఒక వ్యక్తిని పట్టుకోగా, ముగ్గురు పరారయ్యారని తెలిపారు. రూ.15 వేల నగదు, రెండు బైక్‌లను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నాటు సారా తయారీదారుడి అరెస్ట్

కావలి: రూరల్ మండలంలోని గౌరవరంలో నాటు సారా తయారీదారుడ్ని కావలి ఎక్సైజ్ సీఐ సుంకర శ్రీనివాసులు శనివారం అరెస్ట్ చేశారు. వివరాలు.. గురునాథం రమణయ్య తయారు చేస్తుండగా, అరెస్ట్ చేసి రెండు లీటర్ల నాటు సారా, 100 లీటర్ల బెల్లం ఊటను స్వాధీనపర్చుకొని ధ్వంసం చేశారు. నిందితుడ్ని కోర్టులో హాజరుపర్చామని తెలిపారు. ఎక్సైజ్ ఎస్సై దేవిక తదితరులు పాల్గొన్నారు.

నిమ్మ ధరలు



పెద్దవి: రూ.32
సన్నవి: రూ.25
పండ్లు: రూ.15

పౌల్ట్రీ ధరలు



బ్రాయిలర్ (లైవ్)	:115
లేయర్ (లైవ్)	: 100
బ్రాయిలర్ చికెన్	:210
బ్రాయిలర్ స్కిన్‌లెస్	:230
లేయర్ చికెన్	:170

ఖతర్నాక్ కేటుగాళ్లు

- యూపీఐ స్క్రీన్ షాట్లతో నగదు లూటీ
- ఏపీకేలతో ఫోన్లను హ్యాక్ చేస్తూ..
- ఉచ్చులో పడుతున్న ప్రముఖులూ
- అప్రమత్తతతోనే మోసాలకు చెక్

నెల్లూరుకు చెందిన సునీల్‌కుమార్ నగదును డ్రా చేసేందుకు ఏటీఎం సెంటర్‌కు వెళ్లారు. ఈ క్రమంలో అక్కడ ఉన్న వ్యక్తి యూపీఐ ద్వారా నగదును పంపుతానని, రూ.ఐదు వేల క్యాష్ ఇవ్వాలని కోరారు. అయితే ఈ మొత్తాన్ని పంపకుండానే నకిలీ స్క్రీన్ షాట్‌ను చూపి నగదుతో ఉడాయించారు. విషయం తెలుసుకున్న బాధితుడు లబోదిబోమన్నారు.

నెల్లూరుకు చెందిన సుధీర్‌కు బ్యాంక్ యాప్ అంటూ ఏపీకే ఫైల్‌ను వాట్సాప్‌లో పంపారు. నిజమైన యాప్ అని నమ్మి ఆయన ఇన్‌స్టాల్ చేసుకున్నారు. దీంతో ఫోన్‌ను హ్యాక్ చేసి, నంబర్‌తో అనుసంధానమైన ఖాతా నుంచి నగదును కొల్లగొట్టేందుకు యత్నించారు. అయితే బాధితుడు జాగ్రత్త పడటంతో పెద్ద నష్టం నుంచి తప్పించుకోగలిగారు.

ఉదయగిరికి చెందిన ఓ వ్యక్తి.. షాపులో రూ.15 వేల విలువజేసే సరుకులను కొనుగోలు చేశారు. యూపీఐ ద్వారా నగదును పంపానంటూ నమ్మించి అక్కడి నుంచి జారుకున్నారు. చివరికి విషయం తెలుసుకున్న బాధితుడు పోలీసులను ఆశ్రయించారు.



సాంకేతికత ఎంత పెరుగుతోందో.. మోసాలూ అంతే స్థాయిలో ఎక్కువవుతున్నాయి. ప్రస్తుత ఇంటర్నెట్ యుగంలో బ్యాంకింగ్ సేవలు సులువయ్యాయి. దీంతో చిటికెలో నగదు లావాదేవీలు సాగిపోతున్నాయి. ఇంటర్నెట్ బ్యాంకింగ్‌పై సంపూర్ణ అవగాహన ఉన్న వారు అతి కొద్ది మందైతే.. పెద్ద పరిజ్ఞానం లేని వారు కోకొల్లలు. ఇలాంటి వారినే సైబర్ నేరస్తులు లక్ష్యంగా చేసుకొని బురిడీ కొట్టిస్తూ నగదును కాజేస్తున్నారు. జిల్లాలో ఈ తరహాలో మోసపోతున్న వారి సంఖ్య రోజురోజుకూ ఎక్కువవుతోంది. ఖాతాదారులకు పోలీసులు, అధికారులు ఎంత అవగాహన కల్పిస్తున్నా, మోసగాళ్లు అంతే స్థాయిలో రెచ్చిపోతూ కొత్త కొత్త ప్రాడ్లకు పాల్పడుతున్నారు.

నెల్లూరు(సెంట్రల్): సైబర్ మోసాలు.. ఈ పేరు వింటేనే గుండెల్లో రైళ్లు పరిగెడతాయి. ఏ మూల నుంచి నేరగాళ్లు ఏ రకంగా దాడి చేసి నగదును స్వాహా చేస్తారోననే ఆందోళన కలవరానికి గురిచేస్తుంది. నకిలీ క్యూఆర్ కోడ్లు.. నగదు పంపకుండానే స్క్రీన్ షాట్లు చూపడం.. ఏపీకేలను పంపి ఫోన్లను హ్యాక్ చేస్తుండటం.. బ్యాంక్ అధికారులమంటూ ఫోన్ చేసి ఓటీపీలు కోరడం.. డిజిటల్ అరెస్ట్‌లు.. ఇలా చెప్పుకొంటూ పోతే సైబర్ మోసాలు కోకొల్లలు. ఎంతో మంది వీరి బారినపడి ఆర్థికంగా చితికిపోతున్నారు. అధికారులు ఎంత మొత్తుకుంటున్నా, బాధితుల సంఖ్య పెరుగుతూనే ఉంది.

ఏమరుపాటుగా ఉంటే అంతే..

బ్యాంకింగ్ యాప్‌ల తరహాలో ఉండే నకిలీలను కేటుగాళ్లు సృష్టిస్తున్నారు. ఈ రకమైన ఏపీకే ఫైళ్లను వాట్సాప్‌లో పంపి, వాటిని ఇన్‌స్టాల్ చేసుకోవాలని పురమాయిస్తుంటారు. ఒకవేళ వీటిని డౌన్‌లోడ్ చేసుకుంటే ఫోన్ నియంత్రణ మొత్తం నేరగాళ్ల చేతుల్లోకి వెళ్లిపోతుంది. తద్వారా ఓటీపీలను సేకరించి బ్యాంక్ ఖాతాల్లో నగదును ఊడ్చేస్తున్నారు. ఏ బ్యాంకూ ఏపీకే ఫైళ్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని కోరదనే అంశాన్ని అనేక మంది విస్మరిస్తూ, నట్టేట మునిగిపోతున్నారు.

మోసాలు ఎన్నెన్నో..!

- తాము ఫలానా సంస్థ నుంచి ఫోన్ చేస్తున్నామని.. మా యాప్‌లో ఎక్కువగా ఆర్డర్లు పెడుతుండటంతో కొంత నగదును పంపుతామని నమ్మబలుకుతున్నారు. తాము పంపే లింక్‌ను క్లిక్ చేసి.. కార్డు వివరాలను నమోదు చేస్తే నగదు వస్తుందని మభ్యపెట్టి వివరాలు సేకరించి మోసం చేస్తున్నారు.
- బ్యాంక్ కేవైసీ.. పాన్‌కార్డు.. ఆధార్‌కార్డులో వివరాల మార్పంటూ ఫోన్ చేసి ఓటీపీని సేకరించి బురిడీ కొట్టిస్తున్నారు. ఈ ఉచ్చులో చిక్కుకొని నగదును పోగొట్టుకొని బ్యాంకుల చుట్టూ అనేక మంది తిరుగుతున్నారు.

అసలు స్పందించొద్దు



బ్యాంక్‌కు సంబంధించిన యాప్‌లను మెసేజ్‌ల ద్వారా పంపరనే విషయాన్ని తెలుసుకోవాలి. బ్యాంక్ నుంచి ఫోన్ చేస్తున్నాం, ఓటీపీలను చెప్పాలని ఎవరైనా కోరితే అది మోసమనే విషయాన్ని ఖాతాదారులు భావించాలి. ఏమైనా అనుమానం వస్తే అధికారులను సంప్రదించాలి.
– వీరేంద్రనాథ్‌రెడ్డి, సీనియర్ మేనేజర్, కెనరా బ్యాంక్

ఏపీకేలతో జాగ్రత్త



చాలా చోట్ల వాట్సాప్‌లో ఏపీకే ఫైళ్లొస్తున్నాయి. ఇలాంటి వాటిని బ్యాంకులు పంపవు. వీటి ఉచ్చులో పడితే ఫోన్ హ్యాక్ అవ్వడంతో పాటు నగదును కోల్పోయే ప్రమాదం ఉంది. జాగ్రత్త వహించడం ద్వారా ఇలాంటి వాటి నుంచి దూరంగా ఉండొచ్చు.
– శ్రీకాంత్ ప్రదీప్‌కుమార్, లీడ్ బ్యాంక్ జిల్లా మేనేజర్

పోలేరమ్మ తిరునాళ్లకు భారీగా తరలిరావాలి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు

అల్లూరు: అల్లూరులో మంగళవారం నిర్వహించనున్న పోలేరమ్మ, కలుగోళమ్మ, గంగమ్మ తిరునాళ్లకు భక్తులు భారీగా తరలిరావాలని మాజీ ఎమ్మెల్యే, కార్యనిర్వాహకుడు కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి కోరారు. పట్టణంలోని తన నివాసంలో తిరునాళ్ల పోస్టర్లను శనివారం ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. పోలేరమ్మ, గంగమ్మ, కలుగోళమ్మను ఏకకాలంలో ఒకరి ముఖాలు మరొకరు చూడనీయకుండా ఎంతో జాగ్రత్తలతో గ్రామోత్సవాన్ని నిర్వహించడం ప్రత్యేకాకర్షణగా నిలుస్తోందని చెప్పారు. భారీగా తరలివచ్చే భక్తులకు ఎలాంటి ఇక్కట్లు తలెత్తకుండా పక్కా ప్రణాళికలను ఉత్సవ కమిటీ సభ్యులు సిద్ధం చేశారని తెలిపారు. ఇతర రాష్ట్రాల కళాకారులు, టీవీ ఆర్టిస్టులతో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నామని పేర్కొన్నారు. ఉత్సవ కమిటీ సభ్యులు బాలకృష్ణంరాజు, ఊటు శ్రీకాంత్‌రెడ్డి, ఆంజనేయరాజు, కత్తుల విజయ, సుధాకర్, మాలకొండయ్య తదితరులు పాల్గొన్నారు.

బ్యాంక్ ఖాతాలో నగదు మాయం

- రూ.3.96 లక్షలను కొల్లగొట్టిన నేరగాళ్లు

నెల్లూరు(క్రైమ్): బ్యాంక్ ఖాతాలోని రూ.3.96 లక్షలను గుర్తుతెలియని దుండగులు మాయం చేసిన ఘటనపై చిన్నబజార్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. కామాటివీధికి చెందిన సాయికిరణ్ ఎంటెక్ పూర్తి చేసి అమెరికాలోని టెక్సాస్‌లో ఉంటున్నారు. బృందావనంలోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో వ్యక్తిగత ఖాతా ఉంది. కొంత కాలంగా ఇందులో లావాదేవీలను ఆయన నిర్వహించడంలేదు. ఈ క్రమంలో ఇటీవల డబ్బులు రావడంతో తన ఖాతాలో జమ చేశారు. ఈ తరుణంలో అందులోని రూ.3,96,817ను గత నెల ఏడున గుర్తుతెలియని వ్యక్తులు వేర్వేరు ఖాతాలకు బదిలీ చేశారు. ఈ విషయమై నెల్లూరులో ఉంటున్న తన తండ్రి రమేష్‌బాబుకు బాధితుడు తెలియజేశారు. అనంతరం నేషనల్ సైబర్ క్రైమ్ పోర్టల్‌తో పాటు 1930కు ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులకు రమేష్‌బాబు ఫిర్యాదు చేశారు. ఇన్‌స్పెక్టర్ చిట్టెం కోటేశ్వరరావు దర్యాప్తు చేస్తున్నారు.

వీఎస్‌యూను సందర్శించిన ఐఎస్‌వో వాన్ టీమ్



విజయభాస్కర్‌రావుకు సర్టిఫికెట్‌ను అందజేస్తున్న హరగోపాల్

వెంకటాచలం: ప్రథమ సంవత్సర సర్వైలెన్స్ ఆడిట్ నిమిత్తం మండలంలోని కాకుటూరు వద్ద గల విక్రమ సింహపురి యూనివర్సిటీని ఐఎస్‌వో వాన్ టీమ్ శనివారం సందర్శించింది. వీఎస్‌యూలో నాణ్యత ప్రమాణాలు, విధానాలు, నిర్వహణ పద్ధతులు, మౌలిక వసతుల పరంగా ఐఎస్‌వో ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నతమైన పరిశీలనను ఐక్యూఏసీ డైరెక్టర్ అందె ప్రసాద్ ఆధ్వర్యంలో లీడ్ ఆడిటర్ హరగోపాల్ తదితరులు జరిపారు. కెమిస్ట్రీ, బయోటెక్నాలజీ, కంప్యూటర్ సైన్స్, ఫిజిక్స్, మెరైన్ బయాలజీ విభాగాలు, ఎగ్జామినేషన్ సెంటర్, కంప్యూటర్ ల్యాబ్స్‌ను సందర్శించారు. అనంతరం ఇన్‌చార్జి వీసీ విజయభాస్కర్‌రావుకు ఐఎస్‌వో ఒకటో సంవత్సర సర్వైలెన్స్ కొనసాగింపు సర్టిఫికెట్‌ను అందజేశారు.

నేత్రపర్వంగా ఊంజల్‌సేవ



రాపూరు: పెంచలకోన క్షేత్రంలో వెలసిన పెనుశిల లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మీదేవికి ఊంజల్‌సేవను నేత్రపర్వంగా శనివారం నిర్వహించారు. అనంతరం తిరుచ్చి వాహనంపై స్వామి, అమ్మవార్లను ఊరేగించారు. భక్తులు భారీగా తరలివచ్చి దేవదేవేరులను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.

సిలిండర్ పేలి దంపతులకు గాయాలు

నెల్లూరు(క్రైమ్): వంట చేసేందుకు స్టౌ వెలిగిస్తుండగా ప్రమాదవశాత్తూ సిలిండర్ పేలడంతో వివాహిత మంటల్లో చిక్కుకున్నారు. గమనించిన భర్త మంటలను ఆర్పి ఆమెను ఆస్పత్రికి తరలించారు. ఘటనలో వివాహిత శరీరమంతా కాలగా, భర్తకు స్వల్పగాయాలయ్యాయి. పోలీసుల సమాచారం మేరకు.. కొత్తూరులోని సుజాతమ్మ కాలనీకి చెందిన కమల వంట చేసేందుకు స్టౌ వెలిగించగా, సిలిండర్ పేలడంతో మంటల్లో చిక్కుకుపోయారు. పెద్దగా కేకలేయడంతో మరో గదిలో ఉన్న భర్త సుధాకర్ చేరుకొని మంటలను ఆర్పి ఆమెను హుటాహుటిన జీజీహెచ్‌కు, అక్కడి నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం నారాయణ ఆస్పత్రికి తరలించారు. ప్రమాదంలో కమల తీవ్రంగా, సుధాకర్ స్వల్పంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న వేదాయపాళెం పోలీసులు నారాయణ ఆస్పత్రికి చేరుకొని ఘటనకు సంబంధించిన వివరాలను బాధితురాలిని అడిగి తెలుసుకున్నారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చెరువులోకి దూసుకెళ్లిన కారు



మర్రిపాడు: మండలంలోని నందవరం సమీపంలో పెను ప్రమాదం తప్పింది. వివరాలు.. ఎదురుగా వస్తున్న లారీని తప్పించే క్రమంలో ఓ కారు రామానాయుడు చెరువులోకి దూసుకెళ్లింది. రోడ్డు మార్జిన్ లేకపోవడంతో ప్రమాదం సంభవించింది. కారులోని వారు సురక్షితంగా బయటపడ్డారు.